ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 12 ఫిబ్రవరి 2024



ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం



కొత్తచెరువు, ఫిబ్రవరి 11: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు ఆర్ఐఓ సురేశ్ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1231 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరు కావాల్సి ఉండగా.. 1212 మంది వచ్చారన్నారు. 19 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ 722 మందికిగాను 673 మంది హాజరుకాగా.. 49 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 804 మందికిగాను 790 మంది రాగా.. 14 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ 510 మందికిగాను 483 మంది హాజరుకాగా.. 27 మంది దూరంగా ఉన్నారన్నారు. 14వ తేదీ వరకు ప్రాక్టికల్స్ కొనసాగుతాయని ఆర్ఐఓ వివరించారు.



ఒక్క చెరువుకూ నీరివ్వలేదు

ఎన్నికల సమయంలో మండలంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా కాలువద్వారా నీరిస్తామని వైసీపీ నేతలు హామీలు గుప్పించారు. వారి అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతోంది. కాలువ ద్వారా చుక్కనీరు కూడా పారలేదు. ఒక్క చెరువుకూ నీరివ్వలేదు.

- మౌలాసాబ్, నంబులపూలకుంట



పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండిపోయిన హంద్రీనీవా కాలువ

ముందుకు కదలని హంద్రీనీవా కాలువ పనులు



ఆగిపోయిన టన్నెల్ పనులు

నీటి మూటలు..!

- అసంపూర్తిగా టన్నెల్ నిర్మాణం
- ఒక్క చెరువుకూ నీరివ్వని దుస్థితి
- పాలకుల హామీ ఏమైనట్లు?

నంబులపూలకుంట :

'అధికారంలోకి రాగానే హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేస్తాం. మండలంలోని అన్ని చెరువులకు నీరిస్తాం. ప్యాకేజీ పరిధిలోలేని చెరువులకు కూడా నీరిచ్చేలా చొరవ చూపుతాం. పొలాలను సస్యశ్యామలం చేస్తాం' ఇదీ వైసీపీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి 2019 ఎన్నికల సందర్భంగా కురిపించిన హామీల వర్షం. టీడీపీ హయాంలోనే హంద్రీనీవా 17, 18 ప్యాకేజీల పనులు శరవేగంగా సాగాయి. దాదాపు పూర్తయ్యాయి కూడా. రెండుచోట్ల మాత్రం అండర్ టన్నెల్ చేయాల్సి ఉంది. అంతే, ఆ రెండు పనులు పూర్తి చేస్తే కాలువలో నీటిని పారించవచ్చు. పక్కనున్న ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలకు సైతం తీసుకెళ్లచ్చు. ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రానే వచ్చింది. ఐదేళ్లు కూడా అవుతోంది. మళ్లీ ఎన్నికలే వస్తున్నాయి. హంద్రీనీవా కాలువపై పెండింగ్‌లో ఉన్న అండర్ టనెల్ పనులు మాత్రం అడుగు ముందుకుపడలేదు. ఈలెక్కన వైసీపీ ఐదేళ్ల పాలనలో పైసా నిధులివ్వలేదు, అడుగు టన్నెల్ కూడా తవ్వలేదన్నమాట. టనెల్ పనులు పూర్తికాక వర్షపునీరు కాలువలో ముందుకు పారే అవకాశంలేక ఎక్కడికక్కడే నిలబడిపోతోంది. ఆ నీటిని చూపి వైసీపీ పాలకులు.. కాలువ పనులు పూర్తిచేసి, నీరు కూడా పారిస్తున్నామంటూ చెప్పుకునే ప్రయత్నం చేయడంపై జనం నవ్వుకుంటున్నారు.

వైసీపీ రాకతో సీన్ రివర్స్..

ఇంతలోనే ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుత ఎమ్మెల్యే సిద్దారెడ్డి అప్పట్లో ప్రతిపక్షంలో ఉంటూ హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే హంద్రీనీవా కాలువ పనులు పూర్తిచేసి, మండలంలోని చెరువులన్నింటికీ నీరిస్తామంటూ ప్రగల్భాలు పలికారు. వైసీపీ అధికారంలోకి రానే వచ్చింది. ప్రభుత్వం పైసా నిధులు విదిల్చింది లేదు, హంద్రీనీవా పనులు అడుగు కూడా చేసిందిలేదు. టీడీపీ హయాంలో తవ్విన కాలువలకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రస్తుతం గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచి, కంపచెట్లతో నిండుకున్నాయి. ఏళ్లు గడుస్తున్నా కాలువకు నీరు రాకపోవడంతో మండల వాసులు అడియాసలవుతున్నాయి. మండలంలోని పెద్దరామయ్యగారిపల్లి సమీపాన అండర్ టన్నెల్ పనులు చేపట్టారు. పనులు నేటికీ పూర్తికాలేదు. పైపెచ్చులూడి పడుతుండడంతో పనులకు ఆటంకం కలుగుతోంది. పైపెచ్చులు ఊడకుండా సిమెంటు, కాంక్రీటు పూత పూస్తున్నా ఫలితం లేదు. టన్నెల్‌లో నీరు నిలువ ఉండడంతో పనులు నిలిచిపోయాయి. 1.5 కిలోమీటర్ల పొడవైన అండర్ టన్నెల్ పనులకు సంబంధించి సకాలంలో బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్ అర్ధంతరంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది.

టీడీపీ హయాంలో శరవేగంగా..

హంద్రీనీవా కాలువ తలుపుల నుంచి మండలంలోకి గోపాలపురం సమీపంలో ప్రవేశిస్తుంది. మండలం మీదుగా ఉమ్మడి కడప జిల్లాలోకి వెళ్తుంది. అటు నుంచి చిత్తూరు జిల్లాలోకి నీరు తీసుకెళ్లడానికి కాలువ పనులు పూర్తయ్యాయి. మండలంలోని పెద్దరామయ్యగారిపల్లి సమీపాన టన్నెల్ పనులు ఆగిపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి, ఈ ప్రాంతానికి నీరు రాకుండా పోతోంది. 17, 18 ప్యాకేజీల కింద హంద్రీనీవా కాలువ పనులు టీడీపీ హయాంలో శరవేగంగా సాగాయి. రెండుచోట్ల అండర్ టన్నెల్ పనులు తప్ప.. దాదాపు పూర్తయ్యాయి. ఇక తమ ప్రాంతానికి నీరు వస్తుందనీ, ఎక్కడికీ వలస వెళ్లకుండా సొంత ఊరిలోనే ఉంటూ పంటలు సాగు చేసుకోవచ్చని మండల వాసులు ఆశపడ్డారు.

ఎండిపోయిన కాలువలు

నంబులపూలకుంట మండలంలోకి గోపాలపురం వద్ద హంద్రీనీవా కాలువ ప్రవేశిస్తుంది. పెద్దరాంపల్లి, వంకమద్ది, నంబులపూలకుంట, ఎన్ రెడ్డివారిపల్లి, అల్లుగుండువారిపల్లి మీదుగా అన్నమయ్య జిల్లాలోని వెలిగల్లు జలాశయం అనుకుని కాలువ వెళ్తుంది. టన్నెల్ పనులు అసంపూర్తిగా ఉండడంతో నీటి ప్రవాహానికి అవకాశమే లేకుండా పోయింది. వర్షాకాలంలో కాలువలో నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేక ఎక్కడికక్కడే నిండుగా ఉండిపోయేది. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో కాలువలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో పిచ్చిమొక్కలు, కంప చెట్లు ఏపుగా పెరిగాయి.



కాలువలు ఎండిపోయాయి

హంద్రీనీవా కాలువలో నీరు ప్రవహించక పూర్తిగా ఎండిపోయింది. కాలువకు నీరు వచ్చి ఉండుంటే వ్యవసాయ బోర్లు, బావుల్లో నీటిమట్టం పెరిగేది. ప్రస్తుతం ఈప్రాంతంలో భూగర్భ జలమట్టం పూర్తిగా తగ్గిపోయింది. ఖరీఫ్‌లో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మరింత అడుగుకు పడిపోయాయి. - శివారెడ్డి, ఎన్ రెడ్డివారిపల్లి



టన్నెల్ పనులు పూర్తి కాలేదు

మా గ్రామ సమీపంలో అండర్ టనెల్ పనులు పూర్తికాకపోవడంతో హంద్రీనీవా కాలువలో నీరు రాలేదు. ఏళ్లు గడుస్తున్నా టనెల్ పనులు పూర్తి చేయకపోవడంతో మండలానికి హంద్రీనీవా నీరు రాక అన్నది కలగానే మిగిలిపోతోంది. - రఘు, పెద్దరామయ్యగారిపల్లి



ఈ టన్నెల్ పనులకు మోక్షమెన్నడో....?

నిజం గెలవాలి..

- రేపట్నుంచి నారా భువనేశ్వరి పర్యటన



పుట్టపర్తి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలో నిజం గెలవాలి ఓదార్పు యాత్ర చేపట్టనున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి ఓదార్పుయాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ఈపర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయానికి నారా భువనేశ్వరి చేరుకుంటారు. పుట్టపర్తి మండలం నిడుమామిడి నుంచి ఓదార్పుయాత్ర ప్రారంభమవుతుంది. ఓబుళదేవరచెరువు మండలం గాజులకుంటపల్లి, కదిరి టౌన్, తనకల్లు కోర్తికోట, కదిరి రూరల్ ముష్టిపల్లి, తలుపుల మండలాల్లో మృతుల కుటుంబాలను పరామర్శిస్తారు. అదేరోజు కదిరిలో హరీష్ రెసిడెన్షియల్ పాఠశాలలో బసచేస్తారు. రెండో రోజు కదిరి నుంచి బత్తలపల్లి మండలం సంజీవపురంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. ధర్మవరంలో రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో చేనేతలతో ముఖాముఖి నిర్వహిస్తారు. కనగానిపల్లి మండలం వేపకుంట, రామగిరి మండలం పోలేపల్లి, పెనుకొండ దర్గాపేటలో పర్యటిస్తారు. మూడోరోజు హిందూపురం పట్టణం, గుడిబండ మండలం దిన్నేహట్టి, మడకశిర మండలాల్లో నారా భువనేశ్వరి ఓదార్పుయాత్ర ముగించుకుని మధ్యాహ్నం పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. ఇక్కడి నుంచి గన్నవరం బయల్దేరి వెళ్తారు.

చేనేత ఆత్మహత్యల్లేని ధర్మవరమే లక్ష్యం

పరిటాల శ్రీరామ్.. 14న చేనేతలతో నారా భువనేశ్వరి భేటీ



మాట్లాడుతున్న, పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఫిబ్రవరి 11: చేనేత ఆత్మహత్యల్లేని ధర్మవరమే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 14న ధర్మవరం రానున్న నేపథ్యంలో చేనేతలతో టీడీపీ స్థానిక కార్యాలయంలో పరిటాలశ్రీరామ్ ఆదివారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... ఈనెల 14న ధర్మవరంలోని మారుతీరాఘవేంద్రస్వామి ఫంక్షన్ హాల్‌లో చేనేతలతో భువనేశ్వరి సమావేశం అవుతారన్నారు. ధర్మవరం చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను భువనేశ్వరి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆమె నుంచి స్పష్టమైన హామీ తీసుకునేలా చేనేతలంతా కలిసి రావాలన్నారు. ఇప్పటికే ధర్మవరంలో చేనేతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. చీరలకు సరైన గిట్టుబాటుధరలు లేక సబ్సిడీలు అందక అప్పులపాలవుతున్నారన్నారు. చాలామంది అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. వారి కుటుంబాలు అనాథలుగా మారాయన్నారు. మరి కొందరు కార్మికులు ఇతర రంగాలవైపు చూస్తున్నారన్నారు. చేనేత ఆత్మహత్యల నివారణ, హ్యాండ్‌లూమ్స్ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఇప్పటికే ఈ అంశాలన్నీ చంద్రబాబు, నారాలోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్లామనీ, వారు కూడా వీటిపై స్పష్టమైన హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు నారా భువనేశ్వరి దృష్టికి కూడా ఈ సమస్యలు తీసుకెళ్తామనీ, 14న సమావేశానికి పెద్దఎత్తున తరలిరావాలని పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు.

వైసీపీని సాగనంపుదాం

- మాజీ మంత్రి పల్లె పిలుపు
- 200 కుటుంబాలు టీడీపీలో చేరిక



మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి

పుట్టపర్తి, ఫిబ్రవరి 11: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీపై సమష్టిగా పోరాటం చేసి సాగనంపుదామని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి రూరల్ పరిధి పెడబల్లిలో పల్లె ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 200 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా కుటుంబాల వారికి మాజీ మంత్రి పల్లె పార్టీ కండువాలు కప్పి, ఆహ్వానించారు. పల్లె మాట్లాడుతూ.. అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయనీ, రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. టీడీపీలో కష్టపడి పనిచేసేవారికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి అబ్దుల్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన



పుట్టపర్తి, ఫిబ్రవరి 11: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా వీరక్యాతమ్మ బ్రహ్మరథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు



వీరక్యాతమ్మ దేవికి ప్రత్యేక అలంకరణ

మడకశిర రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని కల్లుమర్రి గ్రామంలో వెలసిన వీరక్యాతమ్మ దేవి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి అభిషేకాలు, తోమాలసేవ, 11 గంటలకు నాగదేవతా హోమం, చండీయాగం నిర్వహించారు. ఒంటి గంటకు అమ్మవారి బ్రహ్మరథోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

పైసల్లేవ్..!



పింఛన్లు మంజూరైనా సొమ్ము పంపిణీ చేయని దుస్థితి

రెండు నెలలుగా లబ్ధిదారుల ఎదురుచూపు

ఇస్తారో.. ఇవ్వరో..?



జనవరిలో నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. నిధులు లేవని అధికారులు పంపిణీ చేయలేదు. పింఛన్ ఇస్తారో.. ఇవ్వరో తెలియని పరిస్థితి

- రంగన్న, తాడంగిపల్లి

రొద్దం, ఫిబ్రవరి 11: పైసల్లేక పింఛన్ సొమ్మునూ పంపిణీ చేయలేదు. దీంతో మండలంలో 200 మంది లబ్ధిదారులు పింఛన్ సొమ్ము కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. వైసీపీ పాలకులు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు నెలలకోమారు పింఛన్లు మంజూరుచేసి ఆదుకుంటామని ప్రగల్భాలు పలుకుతున్నారు. రొద్దం మండలంలో 200 పింఛన్లు మంజూరు చేసి, నిధులు లేక ఆగిపోయాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనవరి నెలకు మండల వ్యాప్తంగా 258 పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో 58 మందికి మాత్రం సొమ్ము అందజేశారు. మిగిలిన 200 పింఛన్లకు సొమ్ము విడుదల కాకపోవడంతో లబ్ధిదారులకు అందజేయలేదు. దీంతో ఆయా లబ్ధిదారులు.. పింఛన్ సొమ్ము కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. వచ్చే నెలలోనైనా ఇస్తారో.. లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డిని వివరణ కోరగా.. రొద్దం మండలానికి 258 పింఛన్లు మంజూరు కాగా.. 58కి నిధులు రావడంతో పంపిణీ చేసేశారు. మిగిలిన 200 పింఛన్లకు నిధులు మంజూరవగానే లబ్ధిదారులకు అందజేస్తాం.



అధికారులు చేతులెత్తేశారు

పింఛన్ వచ్చిందని సంబరపడినా నిధులు విడుదల కాలేదని పంచాయతీ అధికారులు చేతులెత్తేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పింఛన్ వస్తుందో.. రాదోనన్న సందేహం నెలకొంది.

- పెద్దవీరప్ప, ఎం.కొత్తపల్లి



సమావేశానికి హాజరైన వారు

ఇంతేనా..!

బల నిరూపణలో బోల్తా..



- శాంత ఆత్మీయ సమావేశానికి జనం కరువు
- 200 మంది కూడా రాని దుస్థితి
- నియోజకవర్గంలో 45వేలమందికిపైగా వాల్మీకులు

హిందూపురం, ఫిబ్రవరి 11: వైసీపీ పార్లమెంటు నియోజకవర్గ సమన్వయ కర్త శాంత బల నిరూపణకు వెళ్లి బోల్తాపడ్డారన్న వాదనలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో వేలమంది శాంత సొంత సామాజిక వర్గానికి చెందిన వాల్మీకులున్నారు. ఆమె నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి 200 మంది కూడా హాజరు కాకపోవడంతో వైసీపీలో అయోమయం నెలకొంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి.. వైసీపీ నియోజకవర్గాల బాధ్యులను మారుస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా కర్ణాటక నుంచి ఇక్కడికి దిగుమతి చేసుకున్న శాంతను నియమించారు. ప్రస్తుత ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారశైలి, ఆయనపై ఉన్న వ్యతిరేకత, ప్రభుత్వంపై ఉన్న అక్కసు నేపథ్యంలో ఆయనకు టిక్కెట్ ఇస్తే డిపాజిట్ దక్కడం కష్టమని సీఎం జగన్ భావించారు. ఆర్థికంగా బలంగా ఉన్న కర్ణాటకకు చెందిన బీజేపీ మాజీ మంత్రి బళ్లారి శ్రీరాములు సోదరి శాంతను హిందూపురానికి తీసుకొచ్చారు. ఈమె వాల్మీకి సామాజికవర్గానికి చెందినవారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఆ సామాజికవర్గానికి అత్యధిక ఓట్లు ఉన్నాయనీ, ఆమెను పోటీ చేయిస్తే కలిసి వస్తుందని భావించి ఇక్కడికి రప్పించారు. ఇక్కడ అధికశాతం వాల్మీకులు తెలుగుదేశం వైపు ఉన్నారు. అధికార పార్టీలో కూడా వాల్మీకులు కోకొల్లలు ఉన్నారు. వారందరినీ కాదని బళ్లారి నుంచి శాంతను రప్పించడంతో సొంత పార్టీలో ఉన్న అదే సామాజికవర్గానికి చెందిన నాయకులు కూడా ఆమెను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో హిందూపురానికి వచ్చి నెలదాటినా ఆమె పరిచయం చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. సొంత సామాజికవర్గంలో తన బలం నిరూపించుకునేందుకు హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వాల్మీకులతో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి 200మంది కూడా రాకపోవడం గమనార్హం.

పురంలో ఇదే చర్చ

వాల్మీకి కల్యాణమండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 200మంది కూడా రాకపోవడంతో ఆమె సొంత సామాజికవర్గంతోపాటు అధికార పార్టీలో అయోమయం నెలకొంది. ఇన్నివేల మంది వాల్మీకులు ఉండి ఇంత తక్కువ మంది రావడం ఏంటని పట్టణంలో ఎక్కడ చూసినా చర్చ సాగుతోంది. సమావేశానికే ఇంతమంది వస్తే ఇక ఆమెకు ఓటు ఎవరు వేస్తారని ప్రశ్నించడం కనిపించింది. దీంతోపాటు ఇప్పటికే శాంతపై మైనార్టీలు గుర్రుగా ఉన్నారు. బీజేపీ తరఫున ఎంపీగా ఉండి ఇక్కడికి వైసీపీ తరఫున రావడంతో ఆమె బీజేపీతో ఉన్న కండువాలను మైనార్టీ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. వైసీపీకి ఓటేస్తే అది బీజేపీకి ఓటేసినట్లేనని అప్పట్లో ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో అధికార పార్టీకి అండగా నిలబడే బలమైన సామాజికవర్గాలతోపాటు సొంత కులంవారు కూడా ఆమెను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఈ ఆత్మీయ సమావేశాన్ని బట్టి స్పష్టం అవుతోంది. నియోజకవర్గంలో వాల్మీకి ప్రజాప్రతినిధులు ఎంతోమంది ఉన్నారు. అయినా ఆమె సమావేశానికి మునిసిపల్ చైర్‌పర్సన్‌తో పాటు నలుగురైదుగురు కూడా వెళ్లినట్లు కనిపించలేదు.

శాంత సొంత బలం ఇంతేనా?

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని హిందూపురం పట్టణంతోపాటు లేపాక్షి, చిలమత్తూరులో సుమారు 45వేల మందికిపైగా వాల్మీకులున్నట్లు ఆ సామాజిక వర్గ నేతలు చెప్పుకుంటుంటారు. ఆదివారం నిర్వహించిన శాంత ఆత్మీయ సమావేశానికి 200మంది కూడా హాజరు కాకపోవడాన్ని బట్టి చూస్తే ఆమెను సొంత సామాజికవర్గానికి చెందిన వారే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఆత్మీయ సమావేశానికే రాని జనం ఆమెకు ఓట్లు ఎలా వేస్తారని ఆ సామాజికవర్గాల నేతలే బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. హిందూపురం పట్టణంలోనే 15వేల మందిదాకా, రూరల్‌లో 20వేల మందిదాకా వాల్మీకులున్నారని కులస్థుల అంచనా. అలాంటిది 200 మంది సమావేశానికి రాకపోవడం ఏంటని అధికార పార్టీలో చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే శాంత ఇతర వర్గాలవారిని కాదని సొంత సామాజికవర్గ నాయకులతోనే అధికంగా కలుస్తూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమె సమాశానికి రాకపోవడం మిలియన్ డాలర్ల ప్రశ్న.



సమావేశంలో మాట్లాడుతున్న శాంత

ఏపీఎల్‌లో కదిరి, మడకశిర జట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 11: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సీనియర్ టీ-20 ఏపీఎల్ క్రికెట్ పోటీల్లో కదిరి, మడకశిర జట్లు విజేతలుగా నిలిచాయి. ఓ మ్యాచ్‌లో కదిరి, పోలీసు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన కదిరి నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 141 పరుగులు చేసింది. ఇందులో ప్రశాంత్ అజేయ హాఫ్ సెంచరీ (79 నాటౌట్)తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన పోలీసు జట్టు 16.5 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. దీంతో కదిరి 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో మడకశిర, ఏబీఎల్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మడకశిర నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 138 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఏబీఎల్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసి, ఓటమి పాలైంది. మడకశిర 2 పరుగుల తేడాతో విజయం సాధించింది.


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ప్రశాంత్

రామగిరి సీఐ శివప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 11: నకిలీ ఓటర్ ఐడీ కార్డుల దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారన్న కారణంగా ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐ, ఒక హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఇద్దరు సీఐలను వీఆర్‌కు తీసుకొచ్చారు. 2021 తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల నేపథ్యంలో కొందరు ఫేక్ ఓటర్ ఐడీ కార్డులు ఉపయోగించి ఓటు వేశారనే విషయంపై తిరుపతి ఈస్ట్, తిరుపతి వెస్ట్, అలిపిరి పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో సరైన దర్యాప్తు చేయలేదనే విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఈ క్రమంలో అప్పటి తిరుపతి ఈస్ట్ సీఐ శివప్రసాద్‌రెడ్డి, తిరుపతి వెస్ట్ సీఐ శివప్రసాద్, తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ ఎస్ఐ జయస్వామి, తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ద్వారకానాథ్‌రెడ్డిని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సస్పెండ్ చేశారు. వారిలో వెస్ట్ సీఐగా ఉన్న శివప్రసాద్ తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేస్తుండగా నాలుగురోజుల క్రితం శ్రీసత్యసాయి జిల్లా రామగిరి సీఐగా బదిలీ చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టారు. అలిపిరి సీఐగా ఉన్న అప్పన్నను అనంతపురం ఎస్పీ వీఆర్‌కు, రైల్వేలో ఉన్న సీఐ దేవేంద్రకుమార్‌ను వీఆర్‌కు పంపుతూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లకు చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లా, ఫిబ్రవరి 11: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తి రెసిడెన్సి కమలానగర్, DCMS రోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. సోమ, మంగళ, రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.



ఎన్నాళ్లీ కష్టాలు..?

- ఆవేదనలో వ్యవసాయ శాఖ ఎంపీఈఓలు
- పని భారం.. తక్కువ వేతనం..
- ఐదు నెలలు ఆలస్యంగా రెన్యువల్...
- రెండు, మూడు నెలలకోసారే జీతాల చెల్లింపు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై 98 మంది విధులు
- సొంత జిల్లాలోనే పోస్టింగ్ ఇవ్వాలని వేడుకోలు



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 11 : వ్యవసాయ శాఖలోని ఎంపీఈఓలు (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్) పని భారంతో విలవిలలాడుతున్నారు. ప్రభుత్వ వైఖరితో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో 2015 లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా అనంత ఉమ్మడి జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను 1000 హెక్టార్లకు ఒకరి చొప్పున కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. అయితే వైసీపీ పాలనలో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ తరపున గ్రామ స్థాయి సిబ్బందిని నియమించారు. వ్యవసాయ శాఖలో వీఏఏలను నియమించారు. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో అప్పటి దాకా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు గడ్డుకాలం ఏర్పడింది. 2020 సంవత్సరంలో అనంత ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 650 మందిలో 260 మందిని చిత్తూరు జిల్లాకు ఓడీ (ఆన్‌డ్యూటీ) పై బదిలీ చేశారు. ఆర్బీకేలను జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది.

తక్కువ వేతనం... పనిభారం..

వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు వేతన వ్యథలు తప్పడం లేదు. ఎంపీఈఓలకు 2015 సంవత్సరంలో రూ.8వేల వేతనం ఇచ్చేవారు. 2016 సంవత్సరంలో వారి వేతనాన్ని రూ.12వేలకు పెంచారు. దీంతోపాటు ఇన్సెంటీవ్ నెలకు రూ.3వేలు వర్తింపజేశారు. పనితీరు ఆధారంగా ఇన్సెంటీవ్ ఖరారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. చిత్తూరు జిల్లాలో పనిచేసే ఎంపీఈఓలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు కూడా వేతనం సరిపోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు సుదూరంగా పోస్టింగ్‌లు ఇవ్వడంతో కష్టాలు తప్పడం లేదు. ఏటా మార్చి నెలాఖరుకు ఎంపీఈఓల రెన్యువల్ గడువు ముగుస్తుంది. అయితే ఐదు నుంచి ఆరు నెలల ఆలస్యంగా రెన్యువల్ చేపడుతున్నారు. వేతనాలు కూడా రెండు, మూడు నెలలకోసారి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే గ్రామ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అసిస్టెంట్లకు సమానంగా ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. అయినప్పటికీ వారితో సమానం గా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శ్రీకాళహస్తి మండలం యనగళూరు ఆర్బీకేలో పనిచేస్తున్న ఎంపీఈఓ అధిక పనిఒత్తిడి, తక్కువ వేతనంతో మానసిక క్షోభకు గురై ఆత్మహత్యాయత్నం చేసింది. సొంత జిల్లాలో పనిచేసే సిబ్బందికే ఆ పరిస్థితి ఉన్నప్పుడు అనంత జిల్లాకు చెందిన ఎంపీఈఓలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏ విధంగా పనిచేస్తారంటూ బాధిత సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తమకు తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు.

ఉమ్మడి చిత్తూరులో 98 మంది..

అనంత జిల్లా నుంచి ఓడీపై 260 మంది ఎంపీఈఓలను పంపారు. వీరిలో 98 మంది ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తప్పని పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. ఇందులో 60 మంది దాకా మహిళా సిబ్బంది ఉండటం గమనార్హం. కొన్నేళ్లుగా ఎంపీఈఓగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునే సదరు సిబ్బంది ఎప్పటికైనా తిరిగి జిల్లాలో పోస్టింగ్ ఇవ్వకపోతారా అన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. అక్కడికి వెళ్లలేక మిగతా 162 మంది మిన్నకుండిపోయారు. తమకు జిల్లాలోనే ఉద్యోగ అవకాశం కల్పించాలని అనేక సార్లు ప్రజాప్రతినిధులు, వ్యవసాయ ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆయా సిబ్బంది ఇతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఎక్కడ..?

: నాగరాజు, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే వీఏఏలతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా వారి కంటే తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. ఆర్బీకే సిబ్బందితో పాటు తమకూ టైం స్కేల్ వర్తింపజేయాలని సీఎం జగన్‌తోపాటు ప్రజాప్రతినిధులకు పలు మార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. చిత్తూరు జిల్లాలో పని చేసే వారికి ఇక్కడ పోస్టింగ్‌లు ఇవ్వాలి. ఇప్పటికైనా పాలకులు మా సమస్యలపై స్పందించాలి

జిల్లాలో తిరిగి పోస్టింగ్ ఇవ్వాలి

: రెడ్డి ప్రసాద్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంపీఈఓల సంఘం అధ్యక్షుడు



అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన 98 మంది ఎంపీఈఓలు ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికంగా మహిళా సిబ్బంది ఉన్నారు. ఆర్బీకే సిబ్బందికి సమానంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ఎంపీఈఓలకు తక్కువ వేతనం ఇవ్వడం సరైంది కాదు. అందులోనూ అనంతకు చెందిన ఎంపీఈఓలను ఓడీపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనులు చేయిస్తుండటంతో అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా అనంత జిల్లాలో తిరిగి పోస్టింగ్‌లు ఇప్పించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

మత్స్యకారులపై జీవో 217 దెబ్బ

- సొసైటీలకు ప్రాణసంకటంగా మారిన జీవో
- అమలైతే సభ్యుల జీవితాలు దుర్భరం
- చెరువుల వేలంపై ఆ వర్గాల్లో ఆందోళన
- భగ్గుమంటున్న మత్స్యకారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 11: మత్స్యకారులపై దెబ్బ వేసే జీవో నెం.217ను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాప కింద నీరులా యత్నిస్తోంది. గతేడాదే ఈ జీవోపై మత్స్యకారులు తిరుగుబాటు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పుడు కొంత వెనక్కి తగ్గింది. తాజాగా మరోమారు ఈ జీవో అమలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండటంతో ఆయావర్గాలు ఆందోళన చెందుతున్నాయి. జీవో అమలైతే మత్స్యకారులు, సొసైటీల పరిస్థితి దుర్భరంగా మారుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

వెరీ డేంజర్ జీవో...



ఉమ్మడి జిల్లాలో దాదాపు 1200 చెరువులున్నాయి. వీటిలో సొసైటీల పరిధిలో 100, గ్రామ పంచాయతీ కింద 300కుపైగా, ఇరిగేషన్ కింద రూ. 300వరకూ ఉన్నాయి. ఇది వరకూ జీవో నెం 776 ప్రకారం ఆయా చెరువులకు సంబంధించిన లీజు సొమ్మును మత్స్యశాఖకు చెల్లించేవారు. సొసైటీల కింద నడిచే చెరువులైతే హెక్టారు విస్తీర్ణానికి చొప్పున లీజు మొత్తాన్ని చెల్లించేవారు. గ్రామ పంచాయతీ కింద చెరువులైతే ఆ గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ కింద నడిచేవి. లబ్ధిదారులు ఆయా చెరువులకు సంబంధించిన లీజు మొత్తాన్ని పంచాయతీ కార్యాలయంలో చెల్లించి చెరువులలో చేపపిల్లలను వ దులుకునేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సొసైటీలను దాదాపుగా ఎత్తివేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. జీవో నెం 217 ద్వారా లీజు పద్ధతిలో కాకుండా చెరువులను వేలం వేయాలని ప్రయత్నిస్తోంది. ఈవేలం ప్రక్రియ కొనసాగితే సొసైటీలు ఆదాయ వనరులు కోల్పోవాల్సి వస్తుందనే వాదనలు ఉన్నాయి. ఇదివరకూ సొసైటీలు తమ పరిధిలోని చెరువులకు లీజు మొత్తాన్ని చెల్లించి చేపల పెంపకం చేపట్టేవారు. వచ్చిన ఆదాయంలో సొసైటీ లో ఉన్న సభ్యులందరూ సమానంగా పంచుకునేవారు. అయితే జీవో నెం 217 అమలైతే చెరువులను వేలంపాట నిర్వహించడంతోపాటు.. ప్రభుత్వమే చేపపిల్లలను వదలడం, పెంపకం, వచ్చిన ఆదాయంలో సొసైటీలకు 30 శాతం, మత్స్యశాఖకు 20 శాతం, ఇరిగేషన్ శాఖకు 40 శాతం, పంచాయతీలకు 10 శాతం చొప్పున చెల్లించే విధంగా జీవోను రూపొందించింది. ఇదే సొసైటీ సభ్యులను ఆందోళనలోకి నెడుతోంది.

ఆదాయం గల్లంతే...

చెరువులకు ప్రభుత్వం వేలంపాట నిర్వహిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిందేనని పలువురు సొసైటీ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 100కుపైగా మత్స్యసహకార సొసైటీలు ఉన్నాయి. ఒక్కో సొసైటీ కింద దాదాపు 80 నుంచి 100 మంది సభ్యులున్నారు. వీరందరూ తమ పరిధిలో ఉన్న చెరువుల్లో చేపల పెంపకం చేపడుతున్నారు. వచ్చిన ఆదాయంలో ఒక్కో సొసైటీలోని సభ్యులు ఒక్కొక్కరు దాదాపు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకూ ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ సొసైటీలను నమ్ముకొని దాదాపు 8500కుపైగా కుటుంబాలు ఆధార పడ్డాయి. తాజాగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 217 అమలైతే తమకు పని లేకపోవడంతో పాటు... ప్రభుత్వమిచ్చే 30 శాతం ఆదాయం ఏ మూలకు సరిదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇతర శాఖలకు నిధులను మళ్లించడం కోసం తమకొచ్చే ఆదాయానికి గండి కొట్టడమేంటని మత్స్యకారులు మండిపడుతున్నారు.



లీజు పద్ధతిలోనే కొనసాగించాలి..

: పోతన్న, మత్స్యసహకార సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు



జీఓ. నెం. 217ను రద్దు చేసి పాత పద్ధతిలో జీవో 776 మేరకు చెరువులను లీజు పద్ధతిలోనే కొనసాగించాలి. అప్పుడే సొసైటీల అభివృద్ధితో పాటు... సొసైటీల కింద ఉన్న సభ్యుల జీవితాలు బాగుంటాయి. ఆ మేరకు ప్రభుత్వం పునరాలోచించి మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి. లేదంటే మత్స్యకారులు, సొసైటీలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

మత్స్యకారులకు తీరని నష్టం

: నగేష్, అధ్యక్షుడు, బుక్కరాయసముద్రం సొసైటీ

జీవో నెం. 217 అమలైతే మత్స్యకారులకు తీరని నష్టం జరుగుతుంది. దీని ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందిపడక తప్పదు. జీవోలో పొందుపరిచిన అంశాలు అమలు పరిస్తే మత్స్యకారుడు రోడ్డున పడే అవకాశం ఉంది. ప్రభుత్వం పునరాలోచించి జీవో నెం. 217ను పూర్తిగా ఎత్తివేయాలి.

వైఎస్‌కు ఆత్మ.. షర్మిలకు పరమాత్మగా కేవీపీ

- ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు కాంగ్రెస్ కుట్ర
- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 11: వైఎస్‌కు ఆత్మగా చెప్పుకుని షర్మిలకు పరమాత్మగా మారిన కాంగ్రెస్ నేత కేవీపీ.. తన అంతరాత్మను చంపుకుని బీజేపీపై ఆరోపణలు గుప్పిస్తున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మండిపడ్డారు. ఆదివారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సత్యకుమార్ మాట్లాడుతూ కేవీపీ స్క్రిప్ట్‌ను కాంగ్రెస్ మార్కెట్ చేస్తోందని, ప్రజలను దోచుకుని, దాచుకునే నాయకులు వైసీపీ, కాంగ్రెస్‌లో ఉన్నారన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చి వైసీపీని గద్దెనెక్కించేందుకు కాంగ్రెస్ కుటిలయత్నం చేస్తోందని మండిపడ్డారు. తద్వారా నిరుద్యోగ రాజకీయ నాయకులకు చిన్న చిన్న పదవులను పొందటం. వారి పిల్లలను ఎంపీలు, ఎమ్మెల్యేలుగా చేసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు. ఓడిపోతే జగన్ విదేశాలకు పారిపోతాడన్నారు. అనంతరం వైసీపీని కాంగ్రెస్‌లో విలీనంచేసి 2029వరకు కొత్తగా వచ్చిన వాళ్లను ప్రజలమీద రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ కుట్రలను ప్రజలకు కేవీపీ చెప్పకుండా బీజేపీకి వైసీపీ ముడుపులిస్తోందని ఆరోపిస్తున్నారన్నారు. మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా పేర్లు చెబితేనే అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తి వెన్నులో వణుకు పుడుతుందన్నారు. అలాంటి వారికి వైసీపీ ముడుపులు ఇస్తుందని కాంగ్రెస్ ఆరోపణలు చేయడం దారుణమన్నారు. బీజేపీకి ముడుపులు ఇస్తున్నట్లు వైసీపీ అధినేత జగన్‌తో చెప్పించాలని నిలదీశారు. కాంగ్రెస్‌ది ముడుపుల సంస్కృతి అని దేశ ప్రజలకు తెలుసన్నారు. అందుకే ఏపీతోపాటు దేశం మొత్తం కాంగ్రెస్‌ను తిరస్కరిస్తోందన్నారు. మోదీపై ఆరోపణలు చేసిన రాహుల్ గాంధీ అడ్రస్‌లేకుండా పోయాడన్నారు. సొంత నియోజకవర్గంలో దారుణంగా ఓడిపోయి కేరళలో పోటీ చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్ కుటుంబీకుల అడుగులకు మడుగులొత్తే కేవీపీదే సూట్‌కేసులు మోసే సంస్కృతి అన్నారు. గతంలో సోనియా, రాహుల్‌కు ముడుపులు పంపలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్లు గొంది అశోక్‌కుమార్, చైతన్య కిషోర్, నాయకులు అజేష్ యాదవ్, జూటూరు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడు

గార్లదిన్నె, ఫిబ్రవరి 11 : భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తూ, కొంగుబంగారంగా పిలువబడే భక్తుల ఇలవేల్పు గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాల ఘనంగా ప్రారంభమయ్యింది. మాఘమాసం తొలి ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు తెల్లవారుజామున స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి, శ్రీవారికి ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి బియ్యం, బేడలతో పాటు వివిధ రూపాల్లో కానుకలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తొలివారం అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణాలతో మార్మోగింది. ఆలయం అవరణంలో ఉన్న 108 శివలింగాలను, సాయిబాబాను భక్తులు దర్శించుకున్నారు. శెలవు రోజు కావడంతో పట్టణం నుంచి అధిక సంఖ్యతో భక్తులు విచ్చేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, భాస్కర్ పర్టిలైజర్ ఎండీ విజయ్‌బాస్కర్ దంపతులు ప్రసాదం అందచేశారు.



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


కళ్యాణదుర్గంలో రెండు చోట్ల నమోదైన ఓటరు జాబితా


ధర్మవరంలో మరణించినా తొలగించని వైనం..

తవ్వేకొద్దీ తప్పులు..!

- ఓటర్లతో అధికారుల బంతాట
- టీడీపీ కంచుకోటలో గెలుపు కోసం వైసీపీ కుట్రలు
- ఫిర్యాదు చేసినా తొలగించని వైనం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 11 : దొడ్డిదారిన అధికార పీఠం దక్కించుకునేందుకు పాలకపక్షం చేస్తున్న ఎత్తుగడలు అన్నీ..ఇన్నీ.. కావని ప్రతిపక్ష పార్టీలతో పాటు ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ ఓట్లతో బంతాట ఆడటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. గెలుపే పరమావధిగా పోలింగ్ బూత్‌లను సైతం ఇష్టారాజ్యంగా మార్చేస్తున్నారు. ఇది ఓటర్లను అయోమయానికి గురిచేస్తోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఈ తతంగం పెద్ద ఎత్తున జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల మొదలు సార్వత్రికం వరకూ ఏ ఎన్నికల్లోనైనా కళ్యాణదుర్గం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఇక్కడ అధికార పార్టీ గెలుపుపై ఆశల్లేని పరిస్థితి. దీన్ని అధిగమించేందుకు కుట్రకు తెరలేపిందని ప్రతిపక్ష పార్టీ ఆరోపిస్తోంది. పట్టణంలోని పలు వార్డుల్లో ఒకే పేరు, రెండు చోట్ల కనిపిస్తూ ఉంది. కాని ఓటర్ల జాబితాలో నుంచి ఏ మాత్రం తొలగించడం లేదు.

జాబితాలో చిత్రాలెన్నో...

పట్టణంలో సుమారు పలు వార్డుల్లోను 60 మందికి పైబడి ఒకే ఓటరు పేరు, రెండేసి చోట్ల కనిపిస్తోంది. పట్టణంలోని రాజు అనే ఓటరు పేరు రెండేసి చోట్ల కనిపిస్తోంది. ఇదే పేరు 65 వ పోలింగ్ కేంద్రం, సీరియల్ నెంబర్ : 849 లో కనిపిస్తోంది. అదేవిధంగా పద్మావతి పేరు కూడా 66 వ పోలింగ్ కేంద్రంలో, 119 సీరియల్ నెంబర్‌లో కూడా ఇదే పేరు కనిపిస్తోంది. ఆసియా అనే ఓటర్ 65 వ పోలింగ్ బూత్, సీరియల్ నెంబర్ 1034 లో కనిపిస్తోంది. అలీభాషా అనే ఓటరు పేరు కూడా 65 వ పోలింగ్ బూత్, సిరియల్ నెంబర్ 210 లో కూడా కనిపిస్తోంది. బుజ్జమ్మ అనే ఓటరు పేరు కూడా 65వ పోలింగ్ బూత్‌లో సిరియల్ నెంబర్ 826 లో కనిపిస్తోంది. వెంకటేశులు అనే ఓటరు పేరు కూడా 65 వ పోలింగ్ కేంద్రం, నెంబర్ 211 లో కూడా ఉంది. నారాయణస్వామి పేరు 65 వ పోలింగ్ కేంద్రం, నంబర్ 919లో కనిపిస్తోంది. కార్తీక్ కుమార్ ఓటరు పేరు 65 వ పోలింగ్ కేంద్రం, సీరియల్ నెంబర్ 214 లో కనిపిస్తోంది. శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం మండలాల్లో కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం..

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని ప్రతిపక్ష పార్టీ పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం శూన్యం. ముఖ్యంగా పట్టణంలో ఇలాంటి తప్పిదాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయి. పట్టణం అయితే ఎవ్వరికి అనుమానం కలగదని, ఎక్కువగా ఇక్కడే తప్పిదాలు జరిగాయి. తికమక పట్టించే విధంగా ఉంది. ప్రతిపక్ష పార్టీ రెండేసి ఓట్లను ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు అందచేశారు. కాని ఏ స్థాయిలో చర్యలు తీసుకుంటారో తెలియడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓటరు జాబితాను పకడ్బందీగా తయారుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఓటర్లు కోరుతున్నారు.

మరణించినా తొలగించరు..

ధర్మవరంరూరల్ : మండలంలోని బిల్వంపల్లి తండా గ్రామంలో మృతి చెందిన వారి ఓట్లను తొలగించడంలో అధికారులు విఫలమయ్యారు. సుమారు 5నుంచి 7ఏళ్ల క్రితం చనిపోయిన వారి ఓట్లు కూడా జాబితాలో రావడంతో స్థానికులు అవాక్కవుతున్నారు. ఆత్మలు ఏమైనా వచ్చి ఓట్లు వేస్తారా అంటూ పలువురు బీఎల్‌ఓలను ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారి ఓట్లు చనిపోయిన జాబితాలో చేర్చారని ప్రతిపక్షాలు మండిపడుతున్నారు. మాతో కలిసి వచ్చి ఇంటింటా సర్వేచేసి తీరా జాబితాలో అలాగే ఉంచుతారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

సవరణలేవీ..?

కుందుర్పి: ఓటర్ల జాబితాలో తప్పులు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. ఇంటింటా జాబితాను పరిశీలించామని చెబుతున్న అధికారులు మృతులను, గ్రామంలో లేనివారిని ఓటర్లుగా కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుందుర్పి మండలంలోని తీగలపల్లి గ్రామంలో 185 పోలింగ్ కేంద్రంలో దాదాపు ఎనిమిది మందికి పైగా మృతులు వున్నా వారిని ఓటర్లు గానే కొనసాగుతున్నారు. ఉదాహరణకు 773 సంజీవమ్మ, 777 మల్లన్న, 902 వనజాక్షమ్మ, 1013 సంజీవమ్మ, 1055 యల్లప్ప, ఇలా ఎనిమిది తొమ్మిది మంది మృతుల పేర్లు ఓటర్ల జాబితాలోనే వున్నాయి.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య


సల్మాన్ (ఫైల్)

ధర్మవరం, ఫిబ్రవరి 11: పట్టణంలోని కొత్తపేటలో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన నజీర్‌బాషా, తస్లీం బాను దంపతుల రెండో కుమారుడు సల్మాన్ (14) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అయితే ఆదివారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరి వేసుకున్నాడు. కొద్ది సేపటి తరువాత అతడి అన్న బాబా గది తలుపులు తెరచి చూడగా సల్మాన్ ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. దీంతో బాబా గట్టిగా అరవడంతో చుట్టుప్రక్కల వారు వచ్చి సల్మాన్ మృతదేహాన్ని కిందకు దించారు. అనంతరం టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సల్మాన్ సరిగా చదువుకోలేదని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికుల ద్వారా తెలుస్తోంది.

బావిలో వృద్ధుడి మృతదేహం లభ్యం


కొండారెడ్డి (ఫైల్)

గాండ్లపెంట, ఫిబ్రవరి 11: మండలంలోని ఎల్లుగూటివారి పల్లి సమీపంలో గల బావిలో ఆదివారం వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. అది అదే గ్రామానికి చెందిన కొండారెడ్డి (70) మృతదేహంగా పోలీసులు గుర్తించారు. ఘటనపై వారు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని బావి వద్ద శనివారం సాయంత్రం పంచె, చెప్పులు గ్రామస్థులు గుర్తించారని, వెంటనే తమకు సమాచారం అందించగా.. వెళ్లి ఈతగాళ్లతో గాలింపు చేయించామని, ఆచూకీ తెలియరాలేదని తెలిపారు. అయితే ఆదివారం మళ్లీ గాలించగా.. మృతదేహం లభ్యమైందన్నారు. దీనిపై మృతుడి కుమార్తె రాజమ్మ తమకు ఫిర్యాదు చేశారని, గత మూడు రోజుల నుంచి తమ నాన్న కొండారెడ్డి కనిపించడం లేదని, గత ఏడాది మా అమ్మ చనిపోయిందని, అప్పటినుంచి ఆయన ఒంటరి జీవితం భరించలేక మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడని తెలిపారు. ఈ క్రమంలో మూడురోజుల క్రితం అదృశ్యమయ్యాడని, ఇప్పుడు విగతజీవిగా కనిపించాడని చెప్పారు. మతిస్థిమితం సరిగా లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ కృష్ణవేణి కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

రేపు డయల్ యువర్ డీఎం

ధర్మవరం, ఫిబ్రవరి 11: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ఈ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. రవాణా రంగంలో ఏవేని సమస్యలు ఉన్నా.. సలహాలు, సూచనలు ఇవ్వాలన్నా 9959225859కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమం ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ముదిగుబ్బ, ఫిబ్రవరి11: మండలకేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ముదిగుబ్బ టౌన్, దొరిగల్లు ఫీడర్, గుంజేపల్లి ఫీడర్‌లలో గల గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్టీయూ జిల్లా కమిటీ ఎన్నిక

పుట్టపర్తి, ఫిబ్రవరి 11: జిల్లాకేంద్రంలో ఆదివారం ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, సుబ్బారెడ్డిల పర్యవేక్షణలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కోనంకి చంద్రశేఖర్, కోశాధికారిగా గోబ్రేనాయక్, ఉపాధ్యక్షులుగా ఆదినారాయణ, మరికొంత మందిని ఎంపిక చేశారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలు రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టేవరకు పోరాటం సాగిస్తామంటూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కరియన్న, తిప్పేస్వామి, రమణా నాయక్, వెంగమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్‌కు సన్మానం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి11: ధర్మవరం పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అంబటి సతీష్ కుమార్‌ను ఆపార్టీ నాయకత్వం జాతీయకౌన్సిల్ మెంబర్‌గా నియమించింది. ఇందుకు గాను స్థానిక నాయకులు ఆదివారం ఆయన్ను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్లూరు చంద్ర, కన్వీనర్ అరవిందరెడ్డి, నాయకులు రాప్తాటిరాము, దుస్సాక్రిష్ణ, గుండా పుల్లయ్య, నారాయణస్వామియాదవ్, నబీరసూల్, గంధమనేని నారాయణస్వామి, బండగహరికృష్ణ, అంబటిబద్రినాథ్, మైలవరంసాయినాథ్ తదితరులు ఉన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కార్డెన్‌సెర్చ్

బత్తలపల్లి, ఫిబ్రవరి11: మండలంలోని మాల్యవంతం, అనంతసాగరం గ్రామాలలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్షన్ లీడర్లు, మద్యం, గుట్కా అమ్మేవారి ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాసులు ఆయా గ్రామస్థులతో సభలు నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, ఈ నేపథ్యంలో ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలు చేసినా, పేకాట ఆడినా, మద్యం, గుట్కా అమ్మినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐగా కృష్ణవేణి బాధ్యతలు

గాండ్లపెంట, ఫిబ్రవరి 11: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా కృష్ణవేణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె అనంతపురం ట్రైనింగ్ సెంటర్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం కృష్ణవేణి మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమెకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయం

- భవిష్యత్తుకు గ్యారెంటీలో ధీమా వ్యక్తం చేసిన పార్టీ నాయకులు


ధర్మవరం 4వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు


ధర్మవరం మండలం తుమ్మలలో..


తాడిమర్రి మండలం నిడిగల్లులో..


ముదిగుబ్బ మండలం ముక్తాపురంలో..

ధర్మవరం, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుతున్నారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయంగా కనిపిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతంకాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఒకటవ వార్డులో ఆదివారం వారు పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు మినిమేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ.. పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు అర్థమవుతోందన్నారు. అందుకే టీడీపీ కార్యక్రమాలు ఎక్కడ జరిగినా జనం తండోపతండాలుగా వస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వంపై విసుగు చెందారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఎప్పుడు వైసీపీని ఇంటికి పంపుదామా అన్నట్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇక వార్డులో ప్రజలు పలు సమస్యల్ని వారి దృష్టికి తేగా.. టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరింపజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, గోసలశ్రీరాములు, అత్తార్‌రహీం బాషా, మారుతీస్వామి, సత్యనారాయణాచారి, జనసేన నాయకులు కొటికి రామాంజనేయులు, శివప్రసాద్, సూర్యనారాయణ, ప్రభు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

ధర్మవరంరూరల్: చంద్రబాబుతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. మండలంలోని తుమ్మల, తిప్పేపల్లి, సుబ్బరావుపేట గ్రామాల్లో వారు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఇంటింటికీ తిరిగి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పథకాల గురించి తెలియజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి కనుమరుగైందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కనీస వసతులు కరవయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసుకుంటే గ్రామాలు మళ్లీ అభివృద్ధి పథంలో నడుస్తాయని పేర్కొన్నా రు. ధర్మవరంలో పరిటాలశ్రీరామ్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, నాయకులు గొట్లూరుశ్రీనివాసులు, విజయసారథి, రాఘవరెడ్డి, తుమ్మలనరసింహారెడ్డి, కట్టుబడి విశ్వనాథ్, జంగంనరసింహులు, అజయ్‌కుమార్‌రెడ్డి, అశ్వర్థనాయుడు, నేలకోట రామ్మోహన్‌రెడ్డి, పోతుకుంటరవి, చిట్రారామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నిడిగల్లులో భవిష్యత్తుకు గ్యారెంటీ

తాడిమర్రి: మండలంలోని నిడిగల్లు గ్రామంలో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మినిమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. టీడీపీని గెలిపించుకుని అభివృద్ధికి బాటలు వేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచిరామ్మోహన్, నాయకులు రఘురాం చౌదరి, మారినేని చంద్రశేఖర్, సర్పంచ్‌లసంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, రాజశేఖర్, విశ్వనాథ్, ఆత్మకూరు శ్రీనివాసులు, యల్లప్ప, మురళి, ఫక్కీర్‌రెడ్డి అరవిందరెడ్డి, నాగేంద్ర, గణేశ్, పూసల గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ముక్తాపురం పంచాయతీలో..

ముదిగుబ్బ: మండలంలోని ముక్తాపురం పంచాయతీలోని ముక్తాపురం, ముక్తాపురం తండా, యాకర్లకుంటపల్లి, నలాయకుంటపల్లి గ్రామాల్లో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి మినీమేనిఫెస్టో పథకాల గురించి ప్రజలకు వివరించారు. మండల కన్వీనర్ కరణంప్రభాకర్, నాయకులు మహబూబ్‌పీరా, ఆనంద్, వెంకటాద్రి, చంద్ర, గోపీనాయక్, సూరి, మురళి, ఐటీడీపీ రాజు, నరేష్, కృష్ణమూర్తి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ముస్లింలకు అన్యాయం


ముస్లింలకు యాసిన్ సూర ఫొటోలను అందజేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 11: వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ అన్నారు. పట్టణంలోని 32, 37వ వార్డులలో ముస్లిం కుటుంబాలకు ఆదివారం ఆయన టీడీపీ మైనార్టీ నాయకులతో కలిసి యాసిన్‌సూర ఫొటోలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అందేవన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాలను రద్దు చేసిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే ఆ పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ నియోజవకర్గ అధ్యక్షుడు అత్తార్‌రహీంబాషా, మైనార్టీ నాయకులు రాళ్లపల్లిషరీఫ్, బాబాఫకృద్దీన్, మహబూబ్‌బాషా, కుళ్లాయప్ప తదతరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


ప్రత్యేకాలంకరణలో వాసవీమాత

తాడిమర్రి, ఫిబ్రవరి 11: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని వాసవీ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆర్యవైశ్యులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి సమీపంలోని కోనేరు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడినుంచి కలిశాలతో నీటిని ఆలయంలోకి తెచ్చి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, పూజలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అఖండ నామసంకీర్తన చేశారు. కార్యక్రమంలో వాసవీమహిళా మండలి సభ్యులు,యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కేంద్రం మద్దతుపై హర్షం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 11: ఎస్సీవర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతు తెలపడం పట్ల పట్టణంలోని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గత నవంబరు 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా హాజరై మాదిగలకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్ర కేబినెట్ కమిటీ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఈనెల 6, 7, 8వ తేదీల్లో సుప్రీంకోర్టులో రాజ్యాంగ ధర్మాసనం చేపట్టిన విచారణలో కేంద్రం తరపున అటార్నీ జనరల్ వెంకటరమణి, భారత సోలి సిస్టర్ జనరల్ మెహతార్ కమిటీ వర్గీకరణకు అనుకూలంగా అభిప్రాయాలు తెలపడంపైనా హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, పర్యాటక శాఖమంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పల్లె పరామర్శ


మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పల్లె రఘునాథ రెడ్డి

కొత్తచెరువు, ఫిబ్రవరి 11: మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు కురుబ నాగేంద్ర కుమారుడు మణిదీప్ ఇటీవల కర్ణాటకలోని దొడ్డబళాపూర్‌లో ఆత్మహత్య చేసుకున్న సంఘటన విదితమే. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఆదివారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పల్లె వెంట నాయకులు సాలక్కగారిశ్రీనివాసులు, రామకృష్ణ, ఒలిపిశీన, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, పీవీ శివప్రసాద్, బీడుపల్లి సుబ్బరాయుడు, రాహుల్‌చౌదరి తదితరులు ఉన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 11: శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహిద్దామని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కదిరి డివిజన్ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం వారు సమావేశం నిర్వహించారు. ఇందులో కదిరి డివిజన్‌లోని సంఘం మండల నాయకులు, బలిజ కులస్థులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకుని పట్టణంలో రెండువేలమందితో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి కాలేజీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా కోనేరు వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. పార్టీలకతీతంగా బలిజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 11: మండలంలోని ధనియాన్‌చెరువులో వ్యవసాయ పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు రైతు నరసింహులు ఆదివారం మరమ్మతులు చేస్తుండగా.. షాక్ గురై కింద పడి గాయపడ్డాడు. గుర్తించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రాష్ట్రస్థాయి చెకుముఖిలో ప్రతిభ


ద్వితీయబహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

ధర్మవరం, ఫిబ్రవరి 11: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేటలో ఈ నెల 10, 11వ తేదీలలో రాష్ట్రస్థాయిలో జరిగిన చెకుముఖి టాలెంట్‌టెస్టులో ధర్మవరం పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి ద్వితీయస్థానంలో నిలిచారని హెచ్ఎం రాంప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జూగేశ్‌కుమార్, ఓబులేశు, ఈశ్వర్ చెకుముఖి టాలెంట్ టెస్టులో ద్వితీయస్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారన్నారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఈఈఎంటీ పరీక్షలో పదవ తరగతి విభాగంలో చారుగుండ్ల తులసీకార్తీక్ రెండో ర్యాంకు సాధించారని తెలిపారు.

నాటుసారా ఊట ధ్వంసం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 11: మండలంలోని కట్లు తండా ప్రాంతంలో గల నాటు సారా తయారీ స్థావరాలపై రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో నాటుసారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన నాలుగు వందల లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ సూర్యనాయక్, ఏఎస్ఐ రామక్రిష్ణ, సిబ్బంది ఉన్నట్లు చెప్పారు.

జయహో పల్లె వాల్‌పోస్టర్ల విడుదల

కొత్తచెరువు, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి టీడీపీ నాయకులు జయహో పల్లె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపట్టి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, మాజీ మంత్రి పల్లె ఎమ్మెల్యే కావాలంటూ మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా ఈ పోస్టర్లను ఏర్పాటు చేశారు. వాటిని స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోస్టర్లను నియోజవర్గంలోని ఆరు మండలాల్లో గల ప్రతి గ్రామంలో ప్రదర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయండి


జనసేనలోకి చేరిన వారితో చిలకం మధు సూదన్‌రెడ్డి

ధర్మవరం, ఫిబ్రవరి 11: జనసేనను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని తన స్వగృహంలో ఆదివారం ఆయన సమక్షంలో కొత్తపేటకు చెందిన 10 కుటుంబాల వారు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ చిలకం కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలో కష్ట పడి పని చేసే వారికి ప్రత్యేక గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. పార్టీలోకి చేరిన వారిలో షేక్ మహబూబ్‌బాషా, దేవరకొండ కాశీ, బోయ నాగేశ్, వసంతం నాగేశ్, దాసరి కిరణ్‌తో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు, జనసేన మండల ఉపాధ్యక్షుడు గొట్లూరు జీవీ, కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు పేరూరు శ్రీనివాసులు, బండ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చదువుతోనే భవిష్యత్తు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ శశిధర్ తదితరులు

ధర్మవరం, ఫిబ్రవరి 11: విద్యార్థులు బాగా చదువుకోవాలని, అప్పుడే భవిష్యత్తు బాగుంటుందని అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ శశిధర్, ధర్మవరం ఎంఈఓ-2 గోపాల్ నాయక్ సూచించారు. మండలంలోని నాగలూరు వద్ద గల రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల 16వ వార్షికోత్సవాన్ని ఆదివారం పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్‌తో పాటు ఎంఈఓ-2 విచ్చేశారు. ముందుగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. బాగా చదువుకోవాలని, అప్పుడే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదని సూచించారు. తర్వాత పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెకర్లు రూపారాజా, కృష్ణ, జగదీశ్, హరినాథ్, కరెస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేతలు ఐకమత్యంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కులాల ఐక్యవేదిక కన్వీనర్ జయశ్రీ

ధర్మవరం, ఫిబ్రవరి 11: చేనేత నాయకులందరూ ఐక్యమత్యంతో ఉంటూ సమస్యలను పరిష్కరించుకుందామని చేనేత కులాల ఐక్యవేదిక కన్వీనర్ జయశ్రీ పిలుపునిచ్చారు. పట్టణంలోని శమీనారాయణ స్వామి ఆలయంలో చేనేత నాయకులు అందరూ సమావేశమై చేనేత కులాల ఐక్యవేదిక కన్వీనర్‌గా జయశ్రీని ఎంపిక చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చేనేతలు ఐక్యంగా ఉంటేనే రాజకీయ నాయకులు మనవద్దకు వస్తారన్నారు. అప్పుడు సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. తర్వాత భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో చేనేత సంఘాలనాయకులు గిర్రాజురవి, దేవిప్రకాశ్, గడ్డంపార్థసారధి, పరిశేసుధాకర్, మెటికల కుళ్లాయప్ప, చట్టా లక్ష్మీనారాయణ, లింగంచంద్రశేఖర్, శేషాద్రి, నీలూరి శ్రీనివాసులు, గిర్రాజునగేశ్, కృష్ణమూర్తి, పోలా వెంకటనారాయణ పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీ


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఇస్కాన్ మందిరం నిర్వాహకులు

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి11: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు వల్లించడం, చిత్రలేఖనం, వేషధారణలపై పోటీలు నిర్వహించారు. ఇందులో స్థానిక బ్రిలియంట్ , పీసీఎంఆర్, యశోద, మహర్షి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు మందిరంలో ఉన్న శ్రీజగన్నాథ్, సుభద్ర, బలరామ ప్రతిమలకు పూజలు చేశారు. తర్వాత జరిపిన పోటీల్లో బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి అత్యధికంగా బహుమతులను సాధించారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు శ్రీకృష్ణమాధవదాస్, భక్తులు పాల్గొన్నారు.

నేడు తనకల్లులో స్పందన

తనకల్లు, ఫిబ్రవరి 11: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు. ఇందులో ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

అలరించిన అనుగ్రహం నాటిక


నృత్యరూపకంగా నాటికను ప్రదర్శిస్తున్న నల్గొండ భక్తులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 11: అనుగ్రహం పేరిట సత్యసాయి భక్తులు నృత్యరూపకంగా చేపట్టిన నాటిక ఎంతగానో అలరించింది. పట్టణంలోని ప్రశాంతి నిలయంలోగల సాయి కుల్వంత్ హాల్లో ఆదివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన సత్యసాయి భక్తులు ఈ కార్యక్రమం చేపట్టారు. సత్యసాయి ప్రేమతత్వంపై అనుగ్రహం పేరిట నృత్యరూపకంగా నాటికను అత్యద్భుతంగా ప్రదర్శించి అలరించారు. అలాగే చిన్నారులు నృత్యంతో ఆకట్టుకున్నారు. అనంతరం వారందరూ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

లోకేశ్ శంఖారావం.. జగన్ పతనానికి నాంది

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ తలపెట్టిన శంఖారావం జగన్ ప్రభుత్వ పతనానికి నాంది అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. స్థానిక ఆమె కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో శంఖారావం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లవుతోందని, ఈ రాక్షస పాలన అంతమొందించడానికి లోకేశ్ శంఖారావం పూరించారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వనరులను దోచుకుని, అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి అనాలోచిత నిర్ణయాలపై, అరాచక పాలనపై గొంతెత్తి ప్రజలకు మద్దతుగా లోకేశ్ నిలిచారన్నారు. 40 రోజులపాటు 120 నియోజకవర్గాలలో ఈ యాత్ర సాగుతుందని, ఆదివారం నుంచి ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభం అవుతుందన్నారు. శంఖారావంతో వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ఘోర పరాజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, వాసుదేవరెడ్డి, సోము, త్రివేంద్ర, శ్రీనాథ్‌చౌదరి పాల్గొన్నారు.

నేడు రైతు సంఘం ధర్నా

మడకశిర రూరల్ ఫిబ్రవరి 11: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించాలంటు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు భూపోరాట సమితి అధ్యక్షుడు సీఆర్ వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పెద్దన్న. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జంగాలపల్లి పెద్దన్న తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 11: గాన గంధర్వుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, సంగీత విద్వాంసుడు అయిన ఘంటసాల వెంకటేశ్వరరావుకు భారత రత్న ఇవ్వాలని ఆయన అభిమానులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఇందిరా పార్కులో ఆయన 51వ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధిచెందిన భగవద్గీతను స్వయంగా శ్రీకృష్ణ పరమాత్ముడే ఆలపించాడనే విధంగా పాడి అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. అంతటి మహా గాయకునికి భారతరత్న ఇవ్వడంలో అతిశయోక్తి లేదన్నారు. ఎంఈఓ గంగప్ప, రిటైర్డ్ ఎస్ఐ లోకేష్ పాల్గొన్నారు.

పాఠశాల దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 11: విద్యార్థుల పాఠశాల దశనుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని చిన్న పిల్లల వైద్యుడు కేశవులు, ఎంఈఓ గంగప్ప అన్నారు. ఆదివారం స్థానిక వేణు విద్యావిహార్ పాఠశాలలో 29వ వార్షికోత్సవ వేడుకలు కరెస్పాండెంట్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారికి విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ-2 ప్రసన్నలక్ష్మీ, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు పాంచజన్య శ్రీనివాసులు, కోశాధికారి రియాజ్, ఎల్ఆర్‌జీ హెచ్ఎం ప్రసాద్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

హిందూపురం, ఫిబ్రవరి 11: పట్టణంలోని ఆల్‌హిలాల్ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన మార్క్స్ సూపర్‌స్పెషాలిటీ హర్ట్‌కేర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు రిబ్బన్‌కట్‌చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు నాగరాజు, వినోద్, యూటీఎఫ్ మారుతి, డాక్టర్ ఈటీ రామ్మూర్తి, ఎంఈఓ గంగప్ప, శేషాచలం, ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు రంజిత్, నారాయణస్వామి, రాము, అనీల్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా ప్రసాద్ బాధ్యతలు

రొళ్ల, ఫిబ్రవరి 11: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ప్రసాద్ ఆదివారం ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు అనంతపురం జిల్లాపరిషత్ కార్యాలయం నుంచి నియమాక ఉత్తర్వులు అందాయి.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 11: సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నారాయణ సేవ కార్యక్రమంలో భాగంగా పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆదివారం స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం వద్ద సమితి సభ్యులు 200మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన నాగరత్నమ్మ, రాజగోపాల్, సహాయ సహకారాలను అందించారు.

రేపు నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 11: మండలంలోని మునిమడుగు గ్రామంలో వెలిసిన నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని 13వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ నిర్వాహకుడు రఘునాథశాస్త్రి తెలిపారు. 13న ఉదయం 6 గంటలకు దేవతా నాంది పంచగవ్య మేళనం, అంకురార్పణ, కలశస్థాపన, మూలవిగ్రహాలకు రుద్రాభిషేకం, అంకురార్పణ, కలశార్చన పూజలు ఉంటాయన్నారు. 14వతేదీన విశేష సహస్ర గాయిత్రి హోమం, తిరు కల్యాణోత్సవం, ఉత్సవ విగ్రహాల ప్రాకారోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15వతేదీన చండీ హోమం, రుద్రాభిషేకం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

నేడు కలశ ప్రతిష్ఠాపన

రొళ్ల, ఫిబ్రవరి 11: మండలంలోని బంద్రేపల్లిలో వెలిసిన బైలాంజనేయ స్వామి విమాన గోపుర ప్రతిష్ఠాపన సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజలు తరలిరావాలని వారు కోరారు.

ఘనంగా చోళమాంబదేవి జలధి మహోత్సవం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 11: అమరాపురం మండల కేంద్రంలో వెలిసిన చోళమాంబదేవి అమ్మవారి పెద్దజాతర కార్యక్రమంలో భాగంగా ఆదివారం జలధి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపురకలశ ప్రతిష్ఠాపన, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలో ఊరేగించి జలధి కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కృష్ణమ్మ పరవళ్లు తొక్కేనా?

- తాగు, సాగునీటి కోసం అన్నదాతల అవస్థలు
- 125 చెరువులకు నీరుచేరితే 16,500 ఎకరాల ఆయకట్టు
- నీరు లేక వేలాది ఎకరాల బీడు
- ప్రతిపాదన దశలోనే రత్నగిరి రిజర్వాయర్



వర్షాలు లేక బీడుగా మారిన ఆయకట్టు

మడకశిర, ఫిబ్రవరి 11: కృష్ణా జలాల కోసం మడకశిర ప్రాంత రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. గత ఖరీఫ్‌లో అరకొర పడిన వర్షాలకు చెరువులో చేరిన నీరు ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. 20 అడుగుల మేర నీటి మట్టం పడిపోయిందని అధికారులు చెబుతున్నారు. చెరువు కింద ఆయకట్టు భూములు వందాలది ఎకరాలు బీళ్లుగా మారాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకరవర్గంలో నీటి వనరులు లేకపోవడంతో వర్షాధారంపైనే రైతులు ఆధారపడ్డారు. నియోజకవర్గంలో తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణానది జలాలతో చెరువులను నింపేందుకు కోట్లాది రూపాయాలు వ్యయం చేసి కాలువల నిర్మాణ చేపట్టినా నేటికీ చుక్క నీరు రాలేదు. ఇరిగేషన్ శాఖ పరిధిలో 125 చెరువులు ఉన్నాయి. పెద్ద చెరువులు 48, చిన్న చెరువులు 78 ఉన్నాయి. వీటి కింద 16,500 ఆయుకట్టు భూమి ఉంది. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ప్రజా ప్రతినిధులు నీటిని తెప్పిస్తామని హామీలు ఇస్తారే తప్ప అనంతరం ఏ నాయకుడు పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో కృష్ణానది జలాలు మడకశిర చెరువు తీసుకువచ్చారు.

బీళ్లుగా ఆయకట్టు భూములు

రెండు దశాబ్దాల క్రితం నియోజకవరంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా తాగు సాగు నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. అప్పట్లో అధికారులు వర్షాలు పడి చెరువులకు నీరు చేరిన నీటితో ఆయకట్టు భూములలో పంటలు సాగు చేయకుండా తూములు బంద్ చేయించి భూగర్భజలాలు పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో చెరువుల కింద ఆయకట్టు భూములలో బోర్లు తవ్వించి ఆ నీటితో పంటలు సాగు చేసుకునే వారు. ఆ బోర్లు నేడు ఎండిపోవడంతో ఏళ్ల తరబడి ఆయకట్టు భూములు బీళ్లుగానే దర్శనమిస్తున్నాయి.



కంపచెట్లతో నిండిన హంద్రీనీవా కాలువ

ప్రతిపాదనల దశలోనే రత్నగిరి రిజర్వాయర్ నిర్మాణం

రత్నగిరి రిజర్వాయర్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో వాటి నిర్మాణాలు ప్రతిపాదనల దశలోనే ఆగిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భ జాలాలు అత్యంత లోతుగా ఉన్న ప్రాంతం మధూడి గ్రామం. ఆ గ్రామం మడకశిర నియోజకవర్గంలోనిదే. వర్షాలు కురవకపోతే వంద కుటుంబాలకు తీవ్రమైన తాగు నీటి ఎద్దడి నెలకొంటుంది. ఈ ప్రాంతంలో సరైన నీటివనరులు ఒక్కటి కూడా లేవు. రెండు దశాబ్దాలుగా సరైన వర్షాలు కురవకపోవడంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పులు చేసి బోర్లు తవ్వించుకుని వాటి కిందైనా పంటలు సాగు చేసి కష్టాలు నుంచి గట్టెక్కుదామని ఆశించిన రైతుకు నిరాశే మిగులుతోంది. హంద్రీనీవా కాలువల మధ్య నియోజకవర్గంలో 70 దాకా బ్రిడ్జిల నిర్మాణాం చేపట్టాల్సి ఉంది. రూ.89 కోట్లతో ప్రతిపాదనలు పంపి ఏడాదిన్నర అవుతున్నా నేటికీ నిధులు మంజూరు కాలేదు. బ్రిడ్జిల నిర్మాణం పూర్తి అయితేనే నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు చేరుతాయి.

కృష్ణమ్మ నీరే శరణ్యం

సాగునీటి వనరులు లేకపోవడంతో బోర్లలో ఉన్న కొద్ది పాటి నీటితో ఎకరా, రెండెకరాల్లో పంటలు సాగు చేస్తున్నాం. తనకున్న భూమిలో సగంలోనే పంటలు సాగు చేస్తున్నాం. నీటిసమస్య కారణంగా పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోతున్నాం. మూడు నెలలు క్రితం వర్షాలు కురవడంతో చేరువులోకి అరకొరగా నీరు చేరాయి. ప్రస్తుతం ఆ నీరు కూడా ఎండిపోయాయి. కృష్ణా జలాలు వస్తేనే పంటలు సాగు చేసుకోగలం. ప్రజా ప్రతినిధులు స్పందించి కృష్ణా జలాలు తెచ్చేందుకు కృషి చేయాలి.

- చౌడప్ప , కొడగార్లగుట్ట, రొళ్ల

ప్రజల దరిచేరని కేంద్ర ప్రభుత్వ పథకాలు

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్

గోరంట్ల, ఫిబ్రవరి 11: అనేక సంక్షేమపథకాల ద్వారా ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాలకు అందిస్తుంటే మన రాష్ట్రంలో ప్రజలకు అందకపోవడం దురదృష్టకరమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యకుమార్ అన్నారు. మండలంలోని పాలసముద్రం గ్రామంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శేఖర్‌తో కలిసి ఆదివారం ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ పార్టీ సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని నాలుగుకోట్ల మందికి ఇళ్లు నిర్మించగా, రాష్ట్రంలో 24లక్షల మందికి కేంద్రం ఇళ్లు నిర్మించిందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా వైద్య చికిత్సల కోసం రూ.5లక్షలు చెల్లిస్తోందని, మూడేళ్లుగా ప్రజలకు ఉచిత రేషన్ ఇస్తూ, రాబోవు ఐదు సంవత్సరాల కోసం బియ్యం సరఫరాకు రూ.11లక్షల 45వేల కోట్లు ఖర్చుచేస్తోందన్నారు. వ్యవసాయ యంత్ర పరికరాలకు 50శాతం సబ్సిడీ ఇస్తున్నా, రైతులకు ఎందుకు అందడంలేదని ప్రశ్నించారు. మన ఓట్లతో గెలిచి ప్రజా ప్రతినిధులను ప్రజలు ప్రశ్నించడం అలవర్చుకోవాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, అమర్‌దేవేంద్ర, హరీష్, బాలగోపాల్, మేదర శ్రీనివాసులు, ఈశ్వర్‌రెడ్డి, నజురుల్లా, నాగరాజుయాదవ్, ముంతాజమ్మ, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న సత్యకుమార్

ఎమ్మెల్యే బాలకృష్ణతోనే అభివృద్ధి: టీడీపీ

చిలమత్తూరు, ఫిబ్రవరి 11: హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ హయాంలోనే అభివృద్ధి జరిగిందని టీడీపీ నాయకులు అన్నారు. నాలుగున్నరేళ్ల అధికారంలో ఉండి ఏ అభివృద్ధి చేయలని వైసీపీ నాయకులు ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదన్నారు. ఆదివారం స్థానిక చౌడేశ్వరి ఆలయంలో టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకరవ్గంలో పర్యటించడం, పలు చోట్ల పేదల కోసం సొంత నిధులతో శుద్ధజల కేంద్రాలను ప్రారంభించారన్నారు. ఆయన నియోజకవర్గ పర్యటనకు రాగానే వైసీపీ నాయకుల్లో వణుకు పుడుతోందన్నారు. ఎమ్మెల్యే వచ్చి తిరిగి వెళ్లగానే అసంబద్ధ విమర్శలు చేయడం వైసీపీ నాయకులకు అలవాటైందన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గానికి చుట్టపుచూపుగా వస్తారని పదేపదే అంటున్నారని, కానీ ఎక్కడున్నా నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారా? లేదా అనేది ముఖ్యమన్నారు. అభివృద్ధి గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హతే లేదన్నారు. చిలమత్తూరులో వైసీపీ నాయకులు చేస్తున్న భూకబ్జాలపై టీడీపీ అధికారంలోకి రాగానే బయటపెడతామన్నారు. ఎమ్మెల్యేపై అనవసరపు విమర్శలు చేస్తే తాము చేతులుకట్టుకొని కూర్చోమని, మా సత్తా ఏంటో చూపిస్తామని వారు తీవ్రంగా హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బేకరీ గంగాధర్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బాలాజీ, నాయకులు నందీషప్ప, తిప్పారెడ్డి, శ్రీదేవి, రామప్ప, ప్రవీణ్, మీసేవ సూరి, ఆంజనేయులు, శివ, బయపరెడ్డి, నరేంద్ర, వేణు, చంద్రారెడ్డి, లక్ష్మినరసప్ప, రఫిక్, చంద్ర, శ్రీనివాసరెడ్డి, ఆటో సజ్జప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తాగునీరు వృథా

ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు

పట్టించుకోని పంచాయతీ అధికారులు

రొద్దం, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పైప్‌లైన్ లీకేజీ అయి తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మూడు నెలలుగా మెయిన్ బజార్‌లో ఉన్న హరి చికెన్ సెంటర్ ఎదురుగా సిమెంటు రోడ్డుపై పైప్‌లైన్ పగిలి నీరు ప్రవహిస్తున్నా సర్పంచ్, ప్రజాప్రతినిదులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు వెళ్తుంటారు. రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో అటుగా వెళ్లే ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కనీసం పంచాయతీ అధికారులు కార్యాలయాలకు అటుగా వెళ్లినా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. సిమెంటు రోడ్డుకింద పైప్‌లైన్ ఉండటంతో అది తవ్వడానికి పంచాయతీ అధికారులు సాహసించడం లేదని తెలుస్తోంది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 11: ఆర్యవైశుల ఆరాధ్యదైవం వాసవీమాత ఆత్మార్పణ దినాన్ని వైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ పరిధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం, డీబీ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు నిర్వహించి పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉదయం 8 నుంచి 10.30 వరకు భక్తుల స్వహస్తాలతో విగ్రహానికి పాలాభిషేకం చేశారు. 11 నుంచి 12.30 గంటల వరకు హోమాలు, పూర్ణాహుతి, మహామంగళహారతి, తీర్థప్రసాదం, ఒంటి గంటకు అన్నదానం చేశారు.



అలంకరణలో వాసవీమాత

అగళి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్యులు ఆదివారం కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని నిర్వహించారు. అమ్మవారిని వివిధ పూలతో అలంకరించి హోమాలు, కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

పెనుకొండ: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం దేవతా సత్యనారాయణశెట్టి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు శేషగిరిస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించి వివిధరకాల పూలతో అలంకరించారు.

రొళ్ల: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు.



పెనుకొండలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రజల విశ్వాసం కోల్పోయిన జగన్

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



టీడీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న గుండుమల

మడకశిరటౌన్, ఫిబ్రవరి 11: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, దీంతో తెలుగుదేశం పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో హరేసముద్రం పంచాయతీ పరిధిలో వైసీపీ పార్టీకి రాజీనామా చేసి 50 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారందరికీ పార్టీ కండువాలువేసి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే భవిషత్తు అని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. దీంతోప్రతిరోజూ పార్టీలోకి చేరేవారిసంఖ్య పెరుగుతోందన్నారు. భవిషత్తు తెలుగుదేశంపార్టీదేనని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. హరేసముద్రం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు హెచ్.డి.రవికుమార్, మంజునాథ్, విజయన్నతోపాటు వారి అనుచరులు టీడీపీలోకి చేరారు.

నారా భువనేశ్వరి పర్యటనకు బందోబస్తు కల్పించాలి

ఎన్‌టీఆర్ ట్రస్టు ఛైర్‌పర్సన్, చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి 15వతేదీన గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామంలో పర్యటిస్తున్నారని, కార్యక్రమానికి పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయాలని పెనుకొండ డీఎస్పీని కలిసి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి కోరారు. డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం కలిసి నారా భువనేశ్వరీ పర్యటన, బందోబస్తుపై చర్చించారు. నిజం గెలవాలి పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా దిన్నేహట్టి గ్రామంలో పర్యటిస్తున్నారని తెలిపారు.

బహుజనులు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న జిల్లా రిటైర్డు న్యాయాధికారి కిష్టప్ప

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 11: బహుజనులు చైతన్యవంతులుగా ఎదిగి అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని జిల్లా రిటైర్డ్ న్యాయాధికారి కిష్టప్ప, మాజీ ఐఆర్ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఎస్సీ రైల్వేస్ డా. భరత్ భూషణ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాములు అన్నారు. ఆదివారం బహుజన చైతన్యవేదిక సంస్థ అధ్యక్షులు శివరాం క్రిష్ణ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో సామాజిక ఐక్యత మహాసభను నిర్వహించారు. ముందుగా పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలవుతున్నా బడుగు బలహీనవర్గాల ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. మోసాన్ని జయించాలంటే బహుజనులు చైతన్యవంతులుకావాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఎవరు మంచి చేస్తారో, మీ సమస్యలను పరిష్కరిస్తారో అలాంటివారికి ఓటువేయాలని సూచించారు. బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, న్యాయవాది నాగరాజు, పెనుకొండ నియోజకవర్గంలోని దళితులు, బహుజనులు, మైనార్టీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములకు గాయాలు

గోరంట్ల, ఫిబ్రవరి 11: మండలంలోని రెడ్డిచెరువుపల్లి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనం ఢీకొని అన్నదమ్ములు చంద్రశేఖర్, నాగేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారు తమ్మినాయునిపల్లికి చెందిన లవన్న, లక్ష్మీదేవి దంపతుల కుమారులు. చంద్రశేఖర్ పాలసముద్రం ఉన్నతపాఠశాలలతో 10వ తరగతి చదువుతున్నాడు. నాగేంద్ర స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. లక్ష్మీదేవి మేకలు మేపడానికి కొండగుట్టల్లోకి వెళ్లింది. ఆమెకు భోజనం ఇవ్వడానికి భర్త లవన్న వెళ్తుండగా, కుమారులు ద్విచక్రవాహనంలో తండ్రితో వెళ్లారు. రెడ్డిచెరువుపల్లి సమీపంలో రోడ్డు పక్కన ద్విచక్రవాహనాన్నిఉంచి ఇద్దరు కుమారులను అక్కడే ఉండమనానడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన వడ్డె క్రిష్ణ మరో వ్యక్తి ద్విచక్రవాహనంలో వేగంగా వెళ్తూ రోడ్డు పక్కనున్న విద్యార్థులను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన వారిద్దరిని హిందూపురం తరలించగా, మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించారు. చంద్రశేఖర్ పరిస్థితి విషయమంగా ఉండడంతో కర్నూలుకు తరలించారు. ప్రమాదంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు వాహనాల ఢీ

హిందూపురం, ఫిబ్రవరి 11: హిందూపురం, లేపాక్షి ప్రధాన రహదారిపై పూలకుంట కట్ట సమీపంలో ఆదివారం రెండు వాహనాలు ఢీకొన్నాయి. అనంతపురంకు చెందిన ఓబిరెడ్డి కుటుంబ సభ్యులు హిందూపురంలో జరిగిన ఓ పెళ్లికి కారులో హిందూపురం నుంచి లేపాక్షి వైపు వెళ్తున్నారు. హిందూపురం వైపు వస్తున్న ఇన్నోవా కారును వారు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇన్నోవా కారులో బళ్లారికి చెందిన సిద్దరామయ్య అనే వ్యక్తితోపాటు హిందూపురానికి చెందినవారు ఉన్నారు. ఇరు వాహనాల్లో ఉన్నవారికి ఎలాంటి ప్రాణాపాయం లేదు. బళ్లారికి చెందిన సిద్దరామయ్యపై అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేగంగా వచ్చి ఇన్నోవ కారును ఢీకొన్నట్లు పేర్కొన్నారు.

ఎద్దుల బండిపైనుంచి పడి బాలుడికి అస్వస్థత

గోరంట్ల, ఫిబ్రవరి 11: మండలంలోని బూచేపల్లిలో ఆదివారం పిల్లల ఆడుకుంటుండగా, ఎద్దులబండి మీదపడి విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. బూచేపల్లికి చెందిన తిరుమలేష్, యశోద దంపతుల కుమారుడు రాజేష్ స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవుకావడంతో కొంతమంది పిల్లలు ఇంటి ముందు నిలిపిన ఎద్దుల బండిపైకి ఎక్కి కూర్చోన్నారు. రాజేష్ ఉన్నపలంగా ఎద్దుల బండి వెనుకవైపున పట్టుకుని వేలాడడంతో, ముందుభాగం పైకి లేచి విద్యార్థి ఛాతిపై పడింది. దీంతో అస్వస్థతకు గురై ఊపిరాడకపోవడంతో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని వైద్యులు సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

గోరంట్ల, ఫిబ్రవరి 11: మండలంలోని వానవోలు కస్తూరి రంగనాథస్వామి ఆలయ నిర్మాణానికి లక్కసాని రంగారెడ్డి కుంటుంబ సభ్యులు రూ. 2,04,116 విరాళాన్ని ఆదివారం అందించారు. ఓడీసీ మండలంలోని నల్లచెరువుపల్లికి చెందిన లక్కసాని రంగారెడ్డి కుమారులు ఆలయ కమిటీ అభ్యర్థన మేరకు ఆలయానికి వచ్చి విరాళాన్ని చెక్కు రూపంలో అందించారు. కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు నవీన్‌కుమార్, క్రిష్టప్ప, రంగప్ప, అక్కులప్ప, లింగప్ప అభినందించారు.



చెక్కును అందజేస్తున్న దాతలు

14న ఆంజనేయస్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 11: పట్టణంలోని దండురోడ్డు వద్దనున్న బైలాంజనేయస్వామి ఆలయ సమీపంలో 27 అడుగుల ఏకశిల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని 14వ తేదీన నిర్వహిస్తతన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. మేళాపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి శ్రీకంఠపురం ఆంజనేయస్వామి ఆలయం, అక్కడి నుంచి సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ 101 కొబ్బరి కాయలు కొట్టారు. 14వ తేదీన జరుగు విగ్రహ ప్రతిష్ఠకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.